# పీసీబీ అధికారుల్లో అలజడి

- ‘నమస్తే తెలంగాణ’ వరుస కథనాలకు స్పందన
- అంతర్గత విచారణకు ఉన్నతాధికారుల ఆదేశాలు

నమస్తే ఎఫెక్ట్

హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): తెలంగాణ రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి(టీఎస్‌పీసీబీ) అధికారుల్లో అలజడి మొదలైంది. ‘నమస్తే తెలంగాణ’లో ప్రచురితమైన వరుస కథనాలు అధికారుల్లో చర్చనీయాంశంగా మారాయి. ‘పీసీబీలో కుమ్ములాట’ ‘పీసీబీకి అల్లుడు.. ఇంటర్న్‌షిప్ పేరుతో బంధువుకు ఉద్యోగం’ కథనాలపై ఉన్నతాధికారులు అంతర్గత విచారణ ప్రారంభించారు. ఏండ్ల తరబడి విధులకు హాజరుకాకుండా సంతకాలు పెట్టే సదరు అధికారిణి ఎవరు? ఆమె ఏ విభాగంలో పనిచేస్తారు? ఆమె పేరే మిటని తోటి ఉద్యోగులను ఆరా తీశారు. పీసీబీలో జరుగుతున్న వ్యవహారా లు బయటికి పొక్కడంతో ఉన్నతాధికారులు దిద్దుబాటు చర్యలు చేపట్టారు. విచారణ జరుపుతూ నే, నమస్తే తెలంగాణ కథనాలకు సంస్థ తరపున సీనియర్ సోషల్ సైంటిస్ట్ డాక్టర్ ప్రసన్నకుమార్ సోమవారం వివరణ ఇ చ్చారు. పీసీబీలో సిబ్బంది కొరత ఉన్నదని, కొత్త సిబ్బంది నియామకానికి ప్రభు త్వ అనుమతితో టీఎస్‌పీఎస్సీకి ప్రతిపాదనలు పంపినట్టు తెలిపారు. భర్తీ ఆలస్యమవుతుండటంతో కొంత మందిని ఇంటర్న్‌షిప్ పద్ధతిపై బోర్డు నియమించిందని వివరణ ఇచ్చారు.

# సీఎం రేవంత్‌కు తప్పిన ప్రమాదం

- కాన్వాయ్‌లో ఓ కారు టైర్ బ్లాస్ట్
- కొడంగల్‌కు వెళ్తుండగా ఘటన


మన్నెగూడలో సీఎం కాన్వాయ్ వాహనం టైర్‌ను రిపేర్ చేస్తున్న దృశ్యం

పూడూరు, ఏప్రిల్ 8: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌లోని ఓ వాహనం టైర్ పేలిపోయింది. సోమవారం హైదరాబాద్ నుంచి వికారాబాద్ జిల్లాలోని కొడంగల్‌కు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది. డ్రైవర్ అప్రమత్తతతో త్రుటిలో పెను ప్రమాదం తప్పింది. పూడూరు మండలం హైదారాబాద్-బీజాపూర్ హైవే రోడ్డు మన్నెగూడ సమీపంలో సీఎం వెళ్తుండగా ఆయన కాన్వాయ్‌లోని ఓ కారు టైర్ పేలడంతో భద్రతా సిబ్బంది కంగారుపడ్డారు. స్థానిక పోలీసులు ఆ వాహనం టైర్ మార్పించి పంపించారు. ఈ ఘటనలో ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరుగలేదు.

# 28లోగా ఎస్‌వోసీ వేయాల్సిందే

- ఏపీకి బ్రిజేశ్ ట్రిబ్యునల్ అల్టిమేటం
- మరింత గడువిచ్చేందుకు ససేమిరా
- మే 15 నుంచి విచారణ ప్రారంభం

హైదరాబాద్, ఏప్రిల్ 6 (నమస్తే తెలంగాణ): బ్రిజేశ్ కుమార్ ట్రిబ్యునల్‌లో ఏపీ సర్కారుకు చుక్కెదురైంది. కృష్ణా జలాల పంపిణీ విచారణ అంశాలపై ఎస్‌వోసీ (స్టేట్‌మెంట్ ఆఫ్ కేస్) దాఖలు కోసం జూన్ నెలాఖరు వరకు గడువు ఇవ్వాలన్న ఏపీ విజ్ఞప్తిని ట్రిబ్యునల్ తిరస్కరించింది. రెండు వారాల్లోగా ఎస్‌వోసీని దాఖలు చేయాలని ఆదేశించింది. కృష్ణా జలాల్లో ఉమ్మడి ఏపీకి కేటాయించిన 1,005 టీఎంసీలతో పాటు గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీలను తెలంగాణ, ఏపీ రాష్ట్రాల మధ్య పునఃపంపిణీ చేసేందుకు అంతర్‌రాష్ట్ర జల వివాదాల చట్టం-1956లోని సెక్షన్ 3 ప్రకారం విచారణ జరపాలని, ప్రాజెక్టులవారీగా రెండు రాష్ట్రాలకు నీటిని కేటాయించాలని కేంద్రం నిరుడు అక్టోబర్‌లో నూతన మార్గదర్శకాలను జారీ చేసింది. ఆ విచారణకు సంబంధించి తెలంగాణ ఇప్పటికే ఎస్‌వోసీని సమర్పించింది. ఏపీ సమర్పించలేదు. దీనిపై సోమవారం ఢిల్లీలో బ్రిజేశ్‌కుమార్ ట్రిబ్యునల్ విచారణ చేపట్టింది. ఎన్నికల కోడ్ నేపథ్యంలో ఎస్‌వోసీని సమర్పించలేకపోతున్నామని, జూన్ నెలాఖరు వరకు గడువు ఇవ్వాలని ఏపీ తరపున సీనియర్ అడ్వకేట్ జయదీప్‌గుప్తా అభ్యర్థించారు. తిరస్కరించిన జస్టిస్ బ్రిజేశ్‌కుమార్.. ఈ నెల 28లోగా ఎస్‌వోసీ దాఖలు చేయాలని ఆదేశించారు. రెండు రాష్ట్రాలు కౌంటర్లు సమర్పించాలని పేర్కొంటూ.. విచారణను మే 15, 16, 17 తేదీలకు వాయిదా వేశారు.

# నన్ను దెబ్బతీయడానికి కుట్ర!

- సీఎం రేవంత్‌రెడ్డి ఆందోళన వ్యాఖ్యలు దేనికి సంకేతం?
- కుట్రలు జరిగేది కాంగ్రెస్ పార్టీ లోపలా? బయటా?



హైదరాబాద్, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): తన సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో ఎంపీ అభ్యర్థులను ఓడించి రాజకీయంగా తనను బలహీన పరిచేందుకు కుట్రలు జరుగుతున్నాయని పీసీసీ అధ్యక్షుడు, సీఎం రేవంత్‌రెడ్డి తాజాగా మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. పార్లమెంట్ ఎన్నికల కోసం పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేయడానికి సోమవారం సొంత నియోజకవర్గం కొడంగల్‌కు వెళ్లిన రేవంత్‌రెడ్డి.. తనను రాజకీయంగా దెబ్బ తీయడానికి పెద్ద గూడుపుఠాని జరుగుతున్నదని అన్నారు. మహబూబ్‌నగర్‌లో పార్లమెంట్ ఎన్నికల ప్రచారానికి శంఖారావాన్ని పూరిస్తూ జరిగిన బహిరంగ సభలో కూడా ఇదే వ్యాఖ్యలు చేశారు. తనను రాజకీయంగా దెబ్బ తీయడానికి కుట్రలు జరుగుతున్నాయని పదే పదే సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలు దేనికి సంకేతం? అని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతున్నది. ఈ కుట్రలు కాంగ్రెస్‌లో జరుగుతున్నాయా? లేక బయట రాజకీయ ప్రత్యర్థులు పన్నుతున్నారా? అనేదానిపై ఆయన స్పష్టత ఇవ్వడం లేదు. కాంగ్రెస్‌లో ఏక్‌నాథ్ షిండేలు ఉన్నారని ఒకవైపు బీజేపీ, ఆ పాత్ర రేవంత్‌రెడ్డినే పోషిస్తారని మరో బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తనను రాజకీయంగా బలహీన పరిచే కుట్రలు జరుగుతున్నాయని రేవంత్‌రెడ్డి భయపడటం, తన సొంత పార్టీలో అంతర్గతంగా జరుగుతున్న పరిణామాలు అభద్రతాభావానికి గురి చేస్తున్నాయా? అనే అనుమానాలు వస్తున్నాయి.

**సీఎం, డిప్యూటీ సీఎం మధ్య గ్యాప్!**

ఇప్పటికే సీఎం రేవంత్‌రెడ్డికి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు మధ్య అంతరం పెరిగినట్టు ప్రచారం జరుగుతున్నది. యాదగిరిగుట్ట ఘటన మొదలుకొని తాజాగా తుక్కుగూడ సభా వేదిక వద్ద ఆయన డ్రైవర్‌కు జరిగిన అవమానాన్ని భట్టి తీవ్రంగా పరిగణిస్తున్నట్టు ఆ పార్టీ వర్గాల సమాచారం. మరోవైపు నామినేటెడ్ పోస్టుల నియామకంలో తమను సంప్రదించకుండా ఏకపక్షంగా నిర్ణయం తీసుకున్నారని కొందరు మంత్రులు కినుక వహించారు. ఎంపీ అభ్యర్థుల ఎంపిక పట్ల కూడా పార్టీలో సీనియర్లు బాహాటంగానే తమ అసంతృప్తిని వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పార్లమెంట్ ఎన్నికల్లో తనను బలహీన పరచడానికి పార్టీ నేతలు ఏమైనా వెనుకాల గోతులు తొవ్వుతున్నారా? అలాంటి సమాచారం ఏదైనా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి వచ్చిందా? అని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన అనతికాలంలోనే ప్రభుత్వం పట్ల ప్రజల్లో వచ్చిన వ్యతిరేకత వల్ల కాంగ్రెస్‌కు ఓటమి భయం పట్టుకుందా? అదే జరిగితే రాజకీయంగా తాను బలహీనం అవుతానని సీఎం రేవంత్ రెడ్డి ఏమైనా భయాందోళనకు గురవుతున్నారా? అనే చర్చ జరుగుతున్నది.

# సిరిసిల్ల వస్త్రపరిశ్రమ సంక్షోభానికి తెర

- రేపటినుంచి మరమగ్గాలు మొదలు
- బకాయిల విడుదలకు సర్కారు ఓకే
- దశల వారీగా ఇస్తామన్న పొన్నం
- జేఏసీ నేతలతో ఫలించిన చర్చలు

**కేసీఆర్ హెచ్చరికతో దిగొచ్చిన ప్రభుత్వం**


సిరిసిల్లలో మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల వస్త్ర పరిశ్రమ సంక్షోభానికి తెరపడింది. నేతన్నల పక్షాన బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ చేసిన హెచ్చరిక, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ రాసిన లేఖ సానుకూల ఫలితాన్నిచ్చింది. నేత కార్మికులకు చేతినిండి పని కల్పించి అన్ని విధాలుగా ఆదుకుంటామని రా ష్ట్ర ప్రభుత్వం హామీనిచ్చింది. బీసీ సంక్షేమం, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ సోమవారం సిరిసిల్లకు చేరుకొని, కార్మిక సంఘాల నాయకులు, వస్త్ర ఉత్పత్తి దారులు, ఆసాముల జేఏసీతో జరిపిన చర్చలు ఫలించాయి. పరిశ్రమకు ఇవ్వాల్సిన పెండింగ్ బకాయిలు దశలవారీగా విడుదల చేస్తామని, నేతన్నలకు మెరుగైన ఉపాధి కల్పించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పొన్నం చెప్పడంతో పరిశ్రమను పునః ప్రారంభించేందుకు యజమానులు ముందుకొచ్చారు. సిరిసిల్ల జిల్లాకేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పొన్నం మీడియాతో మాట్లాడారు. పెండింగ్ బకాయిలను పూర్తిస్థాయిలో దశలవారీగా ఇస్తామని చెప్పారు. నేతన్నలకు మెరుగైన ఉపాధి కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. సాంచాలకున్న విద్యుత్తు బకాయిలపై సెస్ అధికారులు ఇబ్బంది పెట్టవద్దని సూచించారు. ఆ తర్వాత వస్త్ర వ్యాపార సంఘ భవనంలో కా ర్మిక సంఘాల నాయకులు, వస్త్ర ఉత్పత్తి దారులతో ఏర్పడ్డ జేఏసీ నాయకులతో మంత్రి చర్చ లు జరిపారు. జేఏసీ పెట్టిన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరిస్తుందని, మరమగ్గాలు ప్రారంభించి కార్మికులకు ఉపాధి కల్పించాలని సూచించారు. అందుకు సమ్మతించిన జేఏసీ నేతలు బుధవారం నుంచి వస్త్ర పరిశ్రమను పునఃప్రారంభించనున్నట్టు ప్రకటించారు.

**రేపటి నుంచి పరిశ్రమ ప్రారంభం**

బీఆర్‌ఎస్ అధినేత చేసిన హెచ్చరికలతో దిగివచ్చిన సర్కారు వెంటనే మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సిరిసిల్లకు పంపించింది. ఆ మేరకు మంత్రి పొన్నం, విప్ ఆది శ్రీనివాస్ సోమవారం వస్త్ర వ్యాపారసంఘ భవనంలో కార్మిక సంఘాల నాయకులు, వస్త్ర ఉత్పత్తిదారులు, ఆసాములతో గంటపాటు చర్చలు జరిపారు. నే తన్నలకు మెరుగైన ఉపాధి కల్పించి, బకాయిలు విడుదల చేస్తామని చెప్పడంతో జేఏసీ నాయకులు అంగీకరించారు. ఈ విషయాన్ని కార్మిక సంఘాలు నాయకుల, వస్త్ర ఉత్పత్తిదారులు, ఆసాములు జేఏసీ నాయకులు పంతం రవి, మూషం రమేశ్, మండల సత్యం వెల్లడించారు. బుధవారం నుంచి సాంచాలను నడిపిస్తామని చెప్పారు. నేత కార్మికులు హర్షం వ్య క్తం చేశారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్, వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## ఏ ముఖం పెట్టుకుని దీక్ష చేస్తావ్?

- పవర్‌లూం క్లస్టర్ అడిగితే నోరెత్తలేదు
- శవాల మీద రాజకీయం చేయొద్దు
- ఎంపీ బండికి మంత్రి పొన్నం హితవు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 8 (నమస్తే తెలంగాణ): సిరిసిల్లకు పవర్‌లూం క్లస్టర్ అడిగితే నోరెత్తని ఎంపీ బండి సంజయ్.. ఇప్పుడు ఏ ముఖం పెట్టుకుని ఈ నెల 10న దీక్ష చేస్తానంటున్నావని బీసీ సంక్షేమ, రవాణా శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించా రు. శవాల మీద రాజకీయం చేయవద్దని హితవు పలికారు. ఐదేండ్లలో కేంద్రం నుంచి ఒక్క రూపాయి అయి నా తెచ్చావా? అంటూ నిలదీశారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో సోమవారం విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డిలతో కలిసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. సిరిసిల్ల నేత కార్మికులకు ఎలాంటి కష్టం రా కుండా ప్రభుత్వం ఆదుకుంటుందని చెప్పారు. వస్త్ర పరిశ్రమ సం క్షోభంపై సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్కతో చర్చించామని, దశలవారీగా బకాయిలు విడుదల చేస్తామని హామీ ఇచ్చారు. ఇప్పటికే ఆర్వీఎం ఆర్డర్లు ఇచ్చి రూ.180 కోట్లు విడుదల చేసినట్టు తెలిపారు.

# డాక్టర్‌ను తిట్టిన మాట వాస్తవమే

- 16 సార్లు ఫోన్ చేసినా ఎత్తలేదు
- సూపరింటెండెంట్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తాం
- సోషల్ మీడియాలో యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్

ములుగు, ఏప్రిల్ 8 (నమస్తేతెలంగాణ): రోడ్డు ప్రమాదానికి గురైన తన బంధువును ములుగు ప్రభుత్వ దవాఖానకు చికిత్స కోసం తీసుకురాగా సమయానికి వైద్యులు లేకపోవడంతో సూపరింటెండెంట్ డాక్టర్ జగదీశ్వర్‌కు ఫోన్ చేసినట్టు యువజన కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బానోత్ రవిచందర్ తెలిపారు. 16 సార్లు ఫోన్ చేసినా స్పందించకపోవడంతో భావోద్వేగానికి లోనై ఫోన్‌లో తిట్టిన మాట వాస్తవమేనని సోషల్ మీడియా ద్వారా అంగీకరించారు. ఈ మేరకు సోమవారం ఓ వీడియోను విడుదల చేశారు. సూపరింటెండెంట్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామన్నారు.

**రవిచంద్రను శిక్షించాలి: వైద్య సంఘాలు**

డాక్టర్ జగదీశ్వర్‌ను ఫోన్‌లో దుర్భాషలాడిన బానోతు రవిచందర్‌పై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వైద్య సంఘాలు డిమాండ్ చేశాయి. ఘటనను ఖండిస్తూ టీవీవీపీ రాష్ట్ర ప్రభుత్వ వైద్యుల సంఘం సోమవారం ప్రకటన విడుదల చేసింది. సూపరింటెండెంట్ స్థాయి వ్యక్తిని బెదిరించటం అమానుష చర్యగా పేర్కొన్నది. రవిచందర్ బేషరతుగా, రాతపూర్వకంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేసింది. లేదంటే కలెక్టర్, పోలీసు సూపరింటెండెంట్‌కు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించింది. ఈ విషయాన్ని త్వరలో సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్తామని తెలిపింది.

**వైద్యం చేసినా.. బూతులు తిట్టారు**

ములుగు సూపరింటెండెంట్ జగదీశ్వర్ సోమవారం టీవీవీపీ కమిషనర్‌కు రాసిన లేఖలోనూ రవిచందర్ తనను దుర్భాషలాడారని పేర్కొన్నారు. ఆదివారం రాత్రి 8.20 గంటలకు రవీందర్ అనే వ్యక్తి తలకు గాయాలై తమ దవాఖానకు రావడంతో డ్యూటీ డాక్టర్ వెంటనే స్పందించి ప్రాథమిక చికిత్స అందించారన్నారు. అతడు అపస్మారక స్థితిలో ఉండటంతో మెరుగైన వైద్యం కోసం 8.40 గంటలకు అంబులెన్స్‌లో పై దవాఖానకు పంపించారని తెలిపారు. ఈ క్రమంలో రవిచందర్ తనకు 8.24 గంటలకు ఫోన్ చేసి అసభ్య పద జాలంతో తిట్టాడని డాక్టర్ జగదీశ్వర్ లేఖలో వివరించారు. ఆడియోను సైతం కమిషనర్‌కు పంపారు


